



జీపుయాత్ర ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

జీపు యాత్రలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు చేపట్టిన జీపు యాత్రను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ సోమవారం ప్రారంభించారు. అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ సర్కిల్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జీపు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి పరమేష్, జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రస్తుత ధరలతో సంబంధం లేకుండా పాత పద్ధతిలోనే మెస్ ఛార్జీలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కాస్మోటిక్ ఛార్జీలు పూర్తిగా ఇవ్వడమే మర్చిపోయారని విమర్శించారు. మౌలిక సదుపాయాలు లేక సంక్షేమ హాస్టల్లో శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలను సమస్యలకు నిలయాలుగా మార్చివేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కూడా పూర్తిగా దిగజారుస్తున్నారని మండిపడ్డారు. కళాశాలల్లో చెప్పడానికి జూనియర్ లెక్చరర్లు లేక ఇంటర్ విద్యలో అనంతపురం జిల్లా తీవ్రంగా వెనకపడుతోందన్నారు. క్రీడలకు సంబంధించి పిఇటి పోస్టులను భర్తీ చేయపోవడం వల్ల పూర్తిగా క్రీడా వ్యవస్థ కళాశాలలో నిర్వీర్యమైపోయిందన్నారు. కార్పొరేట్ కళాశాలలో ఫీజుల నియంత్రణ లేక విచ్చలవిడిగా తల్లి దండ్రుల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారని తెలిపారు. యూనివర్సిటీలలో విద్యా ప్రమాణాలు పూర్తిగా తగ్గిపోయాయని, అధ్యాపక పోస్టులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డిగ్రీ కళాశాలలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ దాదాపు రూ.6400 కోట్లు బకాయిలు పెట్టడం వల్ల డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్లు కళాశాల వద్ద ఉంచుకున్నారని దీంతో నిరుద్యోగం పెరిగిందని చెప్పారు. సంస్కరణల పేరుతో మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరించడానికి సిద్ధమవుతూ పిపిపి విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీని వల్ల పూర్తిగా మెడికల్ విద్యను ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. విద్యా రంగంలోని సమస్యలు తెలుసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ఐదు రోజుల పాటు జీపు యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్ర అనంతపురంలో ప్రారంభమై గార్లదిన్నె, శింగనమల మీదుగా తాడిపత్రికి చేరుకుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠశాలల్లో సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు తెలుసుకుని భవిష్యత్తులో ఆ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు శివ, భీమేష్, సూర్య ప్రకాష్, వంశీ, హరూర్ రషీద్, జిల్లా నాయకులు విజయ్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఒక నెల వర్షంతోనే జిల్లాకు అన్యాయం

లక్షల ఎకరాలు బీడున్నా 'అనంత'లో కరువులేదట..!

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కరువు ప్రకటనపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



సీజన్ మొత్తంలో ఒక్క నెల మాత్రమే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది. ఈ ఒక్క నెల వర్షం పడటంతోనే కరువు మండలాల్లో అనంతపురం జిల్లాకు చోటు లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 31వ తేదీన కరువు మండలాలను ప్రకటించింది. పక్కనున్న సత్యసాయి జిల్లాలో 25 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించారు. కాని అనంతపురం జిల్లాలో మాత్రం ఒక్క మండలం కూడా కరువు మండలాల జాబితాలో లేదు. అంతకు మునుపు 2024లోనూ కరువు మండలాల ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తుతాయి. అప్పుడు కూడా కీలకమైన సమయాల్లో వర్షాల్లేక పంటలు సరిగా చేతికిరాలేదన్న వాదనలున్నాయి. ఈ మేరకు డిఆర్‌సి సమావేశంలోనూ దీన్ని పున: సమీక్షించాలని తీర్మానం చేశారు. కాని అది అమలు జరగలేదు. ఇప్పుడు తిరిగి ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం.

ఆగస్టులో ఒక్కటే అత్యధిక వర్షపాతం

ఖరీఫ్ సీజన్ అంటే జూన్ నుంచి సెప్టెంబరు మాసం వరకు ఉంటుంది. ఈ సీజన్‌లో చూసినప్పుడు జూన్‌లో సాధారణంగా దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. జులై నెలలో ఖరీఫ్ పంటల సాగుకు అనువైన నెలగా భావిస్తారు. ఆగస్టులో వర్షాలొచ్చినా జులై నెలలో వేసిన పంట సంరక్షణకు ఉపయోగపడుతుంది. మొదటి రెండు నెలలు వర్షాలు పడకుంటే పంటల ప్రత్యామ్నాయ పంటలు తప్ప ప్రధానమైన వేరుశనగ పంట పెద్దగా సాగు చేయరు. ఇదే ఈ సంవత్సరం అనంతపురం జిల్లాలో జరిగింది. సీజన్ ఆరంభమైన జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.2 మిల్లీమీటర్లు అయితే 47.9 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 21.7 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. ఇక కీలకమైన జులై నెలలో సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లకుగానూ 24.4 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. ఈ మేరకు చూస్తే 61.8 శాతం వర్షపాతం లోటుంది. ఈ ప్రభావంతో ప్రధాన పంట వేరుశనగ జిల్లాలో 50 శాతం మాత్రమే సాగైంది. సాధారణంగా వేరుశగన 4.49 లక్షల ఎకరాలు సాగవుతుందనుకుంటే 2.28 లక్షల ఎకరాలే సాగైంది. మొత్తం అన్ని రకాల పంటలు కలిపి 9.78 లక్షల ఎకరాలకుగానూ 7.7 లక్షల ఎకరాలే సాగైంది. అంటే రెండు లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. ఇంత తీవ్రమైన పరిస్థితులున్నా అదును దాటక ఆగస్టులో అధికవర్షపాతం నమోదయింది. సాధారణ వర్షపాతం 84.4 మిల్లీమీటర్లు అయితే 165 మిల్లీమీటర్లు పడింది. అంటే 96.6 శాతమే అధికంగా పడింది. ఈ ఒక్క నెలనే సీజను మొత్తంలో వర్షపాతం అధికంగా నమోదయింది. ఆ తరువాత సెప్టెంబరులోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదయింది. సెప్టెంబరులో 111.6 మిల్లీమీటర్లు పడాల్సి ఉంటే 87 మిల్లీమీటర్లు పడింది. సాధారణ వర్షపాతానికి 22 శాతం లోటుంది. మొత్తంగా ఖరీఫ్ సీజన్ మొత్తం 321.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 335.6 మిల్లీమీటర్లు పడింది. అంటే సీజన్‌మొత్తంగా సరాసరిగా చూస్తేసాధారణం కంటే అధికంగా పడినట్టు కనిపిస్తోంది. కాని నెలల వారీగా చూసినప్పుడు పంటలకు పెద్దగా ప్రయోజనం లేకుండానే ఉంది. సీజన్ మొత్తం పడిన వర్షపాతంలో 50 శాతం ఆ ఒక్క నెలలోనే పడింది. దీన్ని బట్టి ప్రభుత్వం కరువు మండలాలల ప్రకటన చేయడం సరైంది కాదని రైతు సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై పున:సమీక్షచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కరువు మండలాలను పున:సమీక్షించాలి



కరువు మండలాలను పున:సమీక్షించాలి. సీజన్ మొత్తంగా కాకుండా పంటల సాగుకు కీలకమైన నెలల్లో నెలకొన్న వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలి. గతేడాది ఇదే రకమైన అన్యాయం జరిగింది. ఈ ఏడాది ఒక్క మండలం కూడా కరువు మండలాల జాబితాలో లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం కరువు మండలాలను పున:సమీక్షించాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సేవలే లక్ష్యం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృతనిశ్చయంతో పని చేస్తున్నట్లు విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం రాయదుర్గం మండల పరిధిలోని బిఎన్.హళ్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.43.6లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని విప్ ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామ శివారు నుంచి సచివాలయ భవనం వరకూ పూలతో అలంకరించిన ఎద్దుల బండిపై ఎమ్మెల్యేను ఊరేగింపుగా, తప్పెట్లతో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు అన్ని వసతులతో సేవలు పొందడానికి వీలుగా సచివాలయ భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు ఏడాదిలోపు పూర్తి చేయాలనేదే లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి అభిమ్ స్కీం కింద ఏడు ఆరోగ్య కేంద్రాలు మంజూరు అయ్యాయన్నారు. ఒక్కో ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి రూ.42 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. డి.హీరేహాల్ మండలంలో రెండు, బొమ్మనహాల్ మండలానికి మూడు, కనేకల్ మండలానికి రెండు ప్రకారం ఆరోగ్య ఉపకేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇఇ సుధాకర్‌నాయక్, ఎంపిడిఒ కొండన్న, జెఇ మునిస్వామి, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, కదరంపల్లి సోమశేఖర్, వీరేష్, హనుమంతరాయుడు, సుంకన్న, సిద్ధప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్.హళ్లిలో ఎద్దుల బండిపై ఊరేగింపుగా వస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

సిఐటియులోకి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్మికులు



సిఐటియులోకి చేరిన కార్మికులతో నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో పని చేస్తున్న సూపర్‌వైజర్‌లు, కార్మికులు సిఐటియులోకి చేరారు. సోమవారం ఆసుపత్రి ఆవరణంలోని సిఐటియు స్థూపం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు, ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సూపర్‌వైజర్‌లుగా పని చేస్తున్న కార్మికులు సిఐటియులో చేరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ వారికి సిఐటియు జెండాలు కప్పి యూనియన్‌లోకి స్వాగతం పలికారు. మొత్తం 22 మంది కార్మికులు చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పద్మా ఏజెన్సీ వచ్చిన తర్వాత కార్మికులు వేధింపులకు గురవుతున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా గవర్నమెంట్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజ్‌లో పని చేస్తున్నప్పటికీ కొత్తగా వచ్చిన ఏజెన్సీ ఎండి భాస్కర్ నాయుడు ఇప్పుడు వారిని పనిలోకి వద్దని చెప్పడం దారుణంగా ఉందన్నారు. ఏ నిబంధనల పేరుతో తొలగిస్తున్నారో అర్థం కాని దుస్థితి నెలకొందన్నారు. కార్మికులకు నోటీసు ఇవ్వాలని అడిగినప్పటికీ సమస్యలు దాటేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఏజెన్సీ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఉదయం7 గంటలకు రాయలసీమ జిల్లాలో ఉన్న కార్మికులు ఐక్యమై నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏటీఎం.నాగరాజు, సిఐటియు నగర కార్యదర్శి ముర్తుజా, జిల్లా కమిటీ సభ్యురాలు నల్లమ్మ, సూపర్‌వైజర్ల యూనియన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్షులు రామాంజి, ఉపాధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి లక్ష్మన్న, జాయింట్ సెక్రెటరీ కోటేశ్వరి, కోశాధికారి నాగేష్, కార్యదర్శులు లోకేశ్వరి, శ్రీరాములు, భారతి, రఘు, రామాంజనేయులు, సలహాదారులు శివకుమార్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి సమస్యకూ విచారించి చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ పి.జగదీష్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా నలమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా 105 ఫిర్యాదులు స్వీకరించగా పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఈనెల 8న కనకదాసు జయంతి సందర్భంగా విద్యాశాఖమంత్రి నారాలోకేష్ పర్యటనను విజయవంతం చేయడానికి అందరం సవాల్‌గా తీసుకుందామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం కంబదూరు రోడ్డులోని కనకదాసు సర్కిల్‌లో మంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆర్‌డిఒ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, టిడిపి నాయకుడు అవినాష్‌లతో పాటు ఆర్‌అండ్‌బి, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. కనకదాసు సర్కిల్‌లో జరిగే ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.


దళిత ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో దళిత ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎంఇఒ రామచంద్ర సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద దళిత, గిరిజన సంఘాల నేతలు ఆందోళన నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు నేరమెట్ల ఎల్లన్న, మందల రమేష్, చిన్న పెద్దన్న, నాగేష్, బంగి ఓబులపతి, మల్లి, మీనుగ రామాంజనేయులు, సాకే చిరంజీవి, ఎస్కేయూ తిరుపాల్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఎస్సీ ఉద్యోగుల పట్ల అగ్రకులాల ఉద్యోగులు, అధికారులు వివక్షత చూపిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గుమ్మగట్ట ఎంఇఒ -2 డాక్టర్ హెచ్.రామచంద్ర, ఐసిడిఎస్ పీడీ ఎమ్.నాగమణిలను తప్పు లేకున్నా సస్పెండ్ చేశారన్నారు. షోకాజ్ నోటీస్ ఇచ్చి వివరణ తీసుకోకుండా ఈ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడం అన్యాయంగా ఉందన్నారు. ఎలాంటి విచారణ లేకుండా అగ్రకులాల వాళ్లు కొంత మంది విద్యా శాఖలో కిందస్థాయి ఉద్యోగులను వివిధ రకాలుగా అణచివేతకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపిస్తూ వారిని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలను దళిత గిరిజన సంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. వెంటనే ఈ ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రమణ, ఓబులేసు, ఉజ్వల్, రామ్‌తీర్థ, వరప్రసాద్, మారుతి, సంజీవులు, పకీరప్ప, సీసీ ఓబులేస్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కడవకల్లు విద్యార్థిని

పుట్లూరు : జిల్లా లెవల్‌లో నిర్వహించిన అథెంటిక్స్ షాట్‌పుట్ విభాగంలో మండల పరిధిలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.నందక్క 6.79 మీటర్లు విసిరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వై.నందక్కను వ్యాయామ ఉపాధ్యాయుడు గంగరాజు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, తదితరులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

ఆపదొస్తే ఆటోలే శరణ్యం

ఆగని ఆర్టీసీ బస్సులు - సాగని పల్లె ప్రయాణం - ప్రయాణికులకు ప్రాణసంకటం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



ఫ్లై ఓవర్‌పై వెళ్తున్న ఆర్టీసీ బస్సు

ప్రజల గోడు అధికారులకు పట్టలేదు.. ఇక్కడ బస్సులు ఆపుతామని హామీ ఇచ్చి మరచిపోయారు... దీంతో రవాణా సౌకర్యం కోల్పోయి 39 గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం నుంచి కర్నూలు, హైదారాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారిలో మిడుతూరు గ్రామం ఉంది. ఈ గ్రామం నుంచి ప్రధానంగా మండల కేంద్రం పెద్దవడుగూరుతోపాటు చుట్టుపక్కల సుమారు 39 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు మిడుతూరుకు వచ్చి బస్సుల్లో ప్రయాణం చేస్తారు. చాలా ఏళ్లుగా జిల్లాలోని గుత్తి, గుంతకల్లు ఆర్టీసీ డిపో వారు ఇక్కడ బస్సులు ఆపేవారు. దీంతో పెద్దవడుగూరు, మిడుతూరు, చిన్నవడుగూరు, మేడిమాకులపల్లి, లక్షుంపల్లి, తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేవారు. అయితే రెండు నెలలుగా బస్సులు ఈ గ్రామం వద్ద ఆపకుండా అక్కడే ఉన్న జాతీయ ప్రధాన రహదారిలో నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై దూసుకుపోతున్నాయి. బస్సులు రహదారిపై వెళ్లిపోతే తాము ఎలా ప్రయాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవిస్తే గుత్తి, గుంతకల్లు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు మిడుతూరులో ఆపేవిధంగా చర్యలు తీసుకుంటామని గతంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి కట్టుబడి సుమారు 20 ఏళ్లుగా బస్సులు ఇక్కడ ఆపిన ఆర్టీసీ వారు బస్సులు ఇక్కడ అపాలని ఉన్న నిబంధనను మరచిపోయారు. కాగా రెండు, మూడు నెలలుగా బస్సులు మిడుతూరులో ఆపడం లేదు. ఈనేపథ్యంలో బస్సులు లేక ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులు మార్గమధ్యంలో ప్రమాదానికి గురై మృత్యువాత పడిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో రైతులు మండల కేంద్రాలకు బ్యాంకులలో పంట రుణాల రెన్యువల్‌కు, విత్తనాలు, ఎరువుల కోసం రోజు ప్రయాణం చేసే అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి సమయంలో బస్సులు లేక ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి గతంలో మాదిరి గుత్తి, గుంతకల్లు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు మిడుతూరులో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను వేగంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సంబంధిత ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపించాలన్నారు. అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా కుట్టు మిషన్‌లు ఇస్తామని మహిళలకు టైలరింగ్ శిక్షణ మూడు నెలలు ఇచ్చారు. ఇంత వరకు కుట్టు మిషన్‌లు ఇవ్వలేదని మహిళలు విన్నవించారు. 120 మంది మహిళలు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో టివి టవర్ వద్ద ఉన్న మానస గార్మెంట్స్ వారు మూడు నెలలు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఇంత వరకు ట్రైనింగ్ సర్టిఫికేట్ పత్రాలు, కుట్టు మిషన్‌లు ఇవ్వలేదని పరిశీలించి కుట్టు మిషన్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఒ ఎ.మాలోల, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'డయల్‌యువర్ సిఎండి'

ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

ప్రజాశక్తి-అనంతపురం



సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ సిఎండి

ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిసిఎల్) వి నూత్నంగా డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించే ఈ మొట్టమొదటి కార్యక్రమాన్ని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 87 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలపై సిఎండి సమాధానమిస్తూ సంస్థ పరిధిలో వినియోగదారుల సమస్యలను స్వయంగా తెలుసుకోవాలనే ధ్యేయంతోనే కార్పొరేట్ కార్యాలయంలో మొట్టమొదటగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. వినియోగదారుల సమస్యలను ఆయా ప్రాంతాల్లో సాంకేతిక అంశాలను పరిగణలోనికి తీసుకుని సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఒక చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయడంగానీ, వాట్సాప్ నెంబర్ 91333 31912కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

యూరియా పంపిణీలో

గందరగోళం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోతిగుట్ట వద్ద ఉన్న 74 ఉడేగోళం సింగిల్‌విండో సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం చేపట్టిన యూరియా పంపిణీలో గందరగోళ పరిస్థితి నెలకొంది. సొసైటీకి 560 బస్తాల యూరియా సరఫరా అయింది. ముందుగా అధికారులు సమావేశం నిర్వహించి టోకెన్ ఇచ్చాక యూరియా పంపిణీ చేపట్టారు. ఒక్కో రైతుకు రెండేసి బస్తాల యూరియా పంపిణీ చేయాల్సి ఉండగా ఒకే వ్యక్తి 16 బస్తాల యూరియాను తీసుకుపోవడంపై పలువురు రైతులు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో సొసైటీ కార్యాలయం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొనగా పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ అక్కడికి చేరుకుని సిబ్బంది సాయంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తాము ఉదయం నుంచి వేచి ఉన్నప్పటికీ తమను కాదని అనంతరం పైరవీ, సిఫార్సులతో వచ్చిన కొందరికి వెంటనే యూరియా బస్తాలు ఇచ్చి పంపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.



అధికారులతో వాగ్వివాదానికి దిగిన రైతులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడిగా వెంకటప్ప

ప్రజాశక్తి-గుత్తి

ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడుగా గుత్తి వాసి వెంకటప్ప నియమితులయ్యారు. గుత్తి మండల పరిధిలోని పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన వెంకటప్ప చాలా ఏళ్లుగా టిడిపిలో చురుగ్గా పని చేస్తున్నారు. ఆయన సేవలు గుర్తించిన టీడీపీ అధిష్టానం వెంకటప్పను ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడుగా నియామకానికి కారణమైన సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ కుటుంబాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.



నారా లోకేష్‌కే బొకే అందజేస్తున్న వెంకటప్ప (పాతచిత్రం)

కరువు మండలాలను ప్రకటించాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతులు



శింగనమల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-శింగనమల

మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలు సకాలంలో వర్షాలు రాకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాల ప్రకటనలో కరువు మండల జాబితాలో చేర్చకపోవడం జిల్లాలోని రైతులు, కూలీలకు తీవ్ర నష్టం చేయడమే అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తొలగించిన పంటలతోపాటు వేరుశనగ, మొక్కజొన్న, ఇతర పంటలు తడిసి తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. అనంతపురం జిల్లాలో 31 మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. ఇప్పటికైనా జిల్లాలోని ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లాని అన్ని మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు వెంకటస్వామి, సూర్యప్రకాష్, సుంకన్న, శ్రీనివాసులు, వెంకటస్వామి, సూర్యప్రకాష్, సుంకన్న, నాగేంద్ర, వెంకటస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పామిడి : అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. ఈమరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ షర్మిలకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, లక్ష్మణ్ కుమార్, శివకుమార్, సాలమ్మ, ముత్యాలు, నరసింహులు, శాసు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సిఐటియు నాయకులు సి.నాగేంద్ర, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు పి.పుల్లయ్య, పూసల హనుమంతు, పూసల వెంకటరాముడు, పూసల ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : తాడిపత్రిని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, రైతుసంఘం సభ్యులు శిరీషా, రైతులు ఆది, నాగార్జున, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు తహశీల్దార్ ఉషారాణికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, ఎపి రైతుసంఘం నాయకులు ఈశ్వర్‌రెడ్డి, బాలరాజు, పూల కిట్ట, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు



పత్తి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సంజీవపురం గ్రామంలో రైతు వై.వెంకటరాముడు సాగు చేసిన అరటి, పత్తి పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుతం అరటిపంటను అమ్మడానికి ప్రయత్నిస్తే వ్యాపారులు తోటను చూసిపోతున్నారే తప్ప కొనడం లేదన్నారు. ఇక పత్తి పంటకు సైతం తెగులు సోకి పూర్తిగా పోయిందన్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే ఇలాంటి పరిస్థితి ఏర్పడటంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఆత్మహత్యే శరణ్యమని రైతు వెంకటరాముడు ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. కావున ప్రభుత్వం స్పందించి తుఫాన్‌కు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, రైతుసంఘం మండల నాయకులు శివారెడ్డి, టి.పెద్దయ్య, కుళ్లాయప్ప, పెద్దయ్య, శేఖర్, నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

'కల్తీ'లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కల్తీ విత్తనాలు, మందులు, నకిలీ ఎరువులను విక్రయిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాల యజమానులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, రైతుసంఘం జిల్లా నాయకులు విరూపాక్షి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతకల్లులో ఫర్టిలైజర్స్ దుకాణదారులు రైతులకు కల్తీ విత్తనాలు, మందులు, నకిలీ ఎరువులను కట్టబెడుతూ నాశనం చేస్తున్నారన్నారు. ఇవి వాడిన రైతులు దిగుబడి రాక అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. వెంటనే సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్. కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు షబ్బీర్, సూరి, ఉల్లిగప్ప, సభ్యులు గోపాల్‌నాయక్, బెల్డోన్ రాజు మల్లేష్, సరస్వతి, షాకీరా, పద్మావతి, గోవిందమ్మ, రవి, నాగరాజు, సుబ్బు, రైతులు పాల్గొన్నారు.

603 మెట్రిక్ టన్నుల యూరియా రాక

అనంతపురం : స్పిక్ కంపెనీకి చెందిన స్పిక్ యూరియా 603 మెట్రిక్ టన్నులు సోమవారం జిల్లాకు చేరినట్లు ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్‌కు 299.97 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు డీలర్లకు 299.97 మెట్రిక్ టన్నులు, సత్యసాయి జిల్లాకు 141.885 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

విత్తన పప్పుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

యల్లనూరు : మండలంలోని రైతులు విత్తన పప్పుశనగ కోసం మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పాసు పుస్తకానికి ఐదు బ్యాగుల పప్పుశనగ అందజేయనున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే



పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


బుక్కరాయసముద్రం : పంచాయతీల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పంచాయతీ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే అపరిశుభ్రత ఉండటంతో పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీల్లో డ్రెయినేజీ, వీధిలైట్లు, తాగునీటి వంటి సౌకర్యాలను ఎప్పకప్పుడు చూసుకుంటూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, టిడిపి మండల నాయకుడు ఓబుళపతి, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల పేరుతో రైతుల నుంచి చేపడుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్‌డిఒ వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం, కంబదూరు, బెళుగుప్ప, కనేకల్లు మండలాల్లో బలవంతపు భూసేకరణ జరుగుతోందన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు నిర్వహించి రైతుల ఆమోదం తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే రెవెన్యూ డివిజన్ పరిధిలో సోలార్ ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న భూసేకరణలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కంపెనీలు పెడుతున్న నిబంధనలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. భూములిచ్చిన రైతులకు ఉపాధి మార్గాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రామచంద్ర, రాఘవేంద్ర, వెంకటేశులు, నటరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు ఎపి రైతుసంఘం నేతల వినతి



ఆర్‌డిఒకు విన్నవిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

కౌన్సిలింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న అబ్దుల్ రజాక్‌గఫూర్

డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు రెండవ విడత కౌన్సిలింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అలైడ్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ సూచించారు. సోమవారం స్థానిక డాక్టర్ కెఎస్‌ఆర్ గఫూర్ ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ డిప్లొమో కోర్సులకు సంబంధించి ప్రభుత్వం ప్రయివేటు కళాశాలకు 4,500 సీట్లు కేటాయించిందన్నారు. వీటిని భర్తీ చేసేందుకు రెండవ కౌన్సిలింగ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈనెల 20వతేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమతశ్రీ, నవ్య, పి.భారతి, హారిక, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో పేదల గుడిసెలు తొలగింపు అన్యాయం

వామపక్ష పార్టీల నేతలు



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కూడేరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికార పార్టీ నేతలు పోలీసు బలగాల నడుమ తొలగించడం అన్యాయమని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించడాన్ని నిరసిస్తూ ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రామిరెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, ఏఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కిష్ట, పట్టణ పేదల సంఘం అధ్యక్షుడు వీరనారప్ప, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, జైభీమ్‌రావు పార్టీ జిల్లా కార్యదర్శి కొడవండ్ల నరేష్, న్యాయవాది చంద్రాచర్ల హరి మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి గ్రామంలో వేలాది ఎకరాలు శోత్రియం భూములు ఉన్నాయని, ఆ భూమిని అక్రమ మార్గంలో స్వాధీనం చేసుకుని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.కోట్లు గడించారన్నారు. ప్రభుత్వ చట్టాల ప్రకారం సదరు భూములపై ఎలాంటి హక్కులు లేని వారు అక్రమ పద్ధతుల్లో అమ్మడం, కొనడం జరిగిందన్నారు. ఈ భూముల్లో ఉన్న వంకలు, వాగులు చివరకు చెరువు భూమి కూడా అమ్మి కొందరు సొమ్ము చేసుకున్నారని తెలిపారు. ఈ భూముల విషయంపై 1992 నుంచి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. హైకోర్టులో కూడా పిటిషన్ వేశారని, ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఉన్న ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పేదలు ఇంటి కోసం గుడిసెలు వేస్తే పోలీసుల బలగాలతో తొలగిస్తున్న అధికార పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులకు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రభుత్వ భూమిని కొల్లగొడుతుంటే కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం కూడా పేదలకు 2 సెంట్ల స్థలం ఇస్తామని హామి ఇచ్చిందని, హామీలో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామంలో పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాలకు పేద ప్రజలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. తక్షణమే విచారణ జరిపించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా కోశాధికారి ఈ.రాయుడు, డి.రామాంజినేయులు, శివయ్య, చంద్రమ్మ, రంగనాయకులు, టి.రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో జరిగిన తొక్కిసలాటల ఘటనల నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజూ, ప్రతినెలా, ఆ సంవత్సరంలో జరగబోవు పెద్ద కార్యక్రమాలు ఎక్కడైతే ఎక్కువ మంది ప్రజలు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయో వాటి వివరాలు ముందస్తుగా సేకరించాలన్నారు. ఆయా కార్యక్రమాలను క్రోడీకరించి సంబంధిత శాఖలు జిల్లా కలెక్టరేట్‌కు తెలపాలన్నారు. సదరు నివేదికను ఆర్‌టిజికి పంపాల్సి ఉంటుందన్నారు.

కోటి సంతకాల సేకరణ

రాయదుర్గం : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో రాయదుర్గంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ ఆరవ శివప్ప, మున్సిపల్ వార్డు సభ్యులు శారద, శ్రీలక్ష్మి, చన్నవీరస్వామి, గోవిందరాజులు, సంజీవప్ప, ఫక్రుద్దీన్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, చేనేత విభాగం కార్యదర్శి పొరాళు శివ, చుంచుల నాగప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పాత పురపాలక సంఘం కార్యాలయం వద్ద పని చేస్తున్న మున్సిపల్ రెగ్యులర్ కార్మికులు, అవుట్‌సోర్సింగ్, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై మస్టర్ సమయంలో మాట్లాడారు. రెగ్యులర్ కార్మికులకు నాలుగు సంవత్సరాలుగా బకాయి ఉన్న సరెండర్ లీవ్, దుస్తుల కూలీ చెల్లించాలని, 12వ వేతన సవరణ అమలు చేయాలని కోరారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

అనంతపురం : కెఎస్‌ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ టీం, ది ఐడియల్ లివింగ్ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ పరిధిలో, లెనిన్‌నగర్‌లో సోమవారం మొక్కలు నాటారు. ఇందులోఉ భాగంగా దాదాపు వంద మొక్కలు నాటి అధ్యాపక బృందంతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ షఫీ, సైకాలజిస్ట్ ఎలుగు సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీరంగయ్య, పూజారి వెంకటేష్, అధ్యాపకులు రామకృష్ణ, పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ అండర్-14 సెలెక్షన్స్

అనంతపురం : నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఎస్‌జిఎఫ్ అండర్-14 జిల్లా సెలెక్షన్స్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రవీంద్ర, వేణు, చరణ్, సునీల్, నాగభూషణ, ఆనంద్, ఈశ్వర్‌రెడ్డి, జగదీష్, జగన్‌మోహన్, గోవింద్, రమేష్ పాల్గొన్నారు.

శాంతి నారాయణకు 'అమృతలత' పురస్కారం



పురస్కారం అందుకున్న శాంతినారాయణ

అనంతపురం : తెలంగాణలోని ఆర్మూరులో నిర్వహించిన కార్యక్రమంలో 'అమృతలత' జీవిత సాఫల్య పురస్కారాన్ని కవి శాంతి నారాయణ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రసాహిత్య అకాడమీ రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సి.మృణాళిని హాజరై పురస్కారం అందజేయడంతోపాటు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు కవులు, మేథావులు శాంతినారాయణను అభినందించారు.

రాయితీ జింక్‌ను సద్వినియోగం చేసుకోండి

శింగనమల : మండల వ్యాప్తంగా రాయితీపై జింక్ కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ అన్వేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి రెండు మెట్రిక్ టన్నుల రాయితీ జింక్‌ను కేటాయించినట్లు తెలిపారు. 10 కిలోల జింక్ బస్తా పూర్తి ధర రూ.663.48, రాయితీ రూ.100 పోయి రైతువాటా రూ.563.5 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన

నార్పల : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలప్ప ఆధ్వర్యంలో విద్యార్థినులకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, తదితర వాటిపై సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

లైవ్‌స్టాక్ కొనుగోలు గ్రౌండింగ్‌పై సమావేశం

ప్రజాశక్తి-పుట్లూరు

లైవ్‌స్టాక్ కొనుగోలు గ్రౌండింగ్‌పై, వెటర్నరీ సిబ్బంది, వెలుగు సిబ్బందికి సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘ సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరంలో 305 యూనిట్లు కొనుగోలు చేసి గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 178 యూనిట్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉండగా 84 యూనిట్లు మాత్రమే గ్రౌండింగ్ చేశారన్నారు. మిగిలిన వాటిని వీలైనంత త్వరగా గ్రౌండింగ్ పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ మేలైన, ఆరోగ్యకరమైన పశువులను కొనుగోలు చేసేందుకు, వాటికి వ్యాక్సిన్ ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎపిఎం వెంకటరామిరెడ్డి, వెలుగు సీసీలు, మండలంలోని వెటర్నరీ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సుష్మాకు 'ఎస్.రాధాకృష్ణన్' అవార్డు



అనంతపురం : భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ట్రెటాయుగ్ ఫౌండేషన్ అందజేసే ప్రతిష్టాత్మకమైన ఎస్.రాధాకృష్ణన్ విజనరీ మెంటార్ అవార్డును ముచ్చుకోట సుష్మాకు ప్రదానం చేశారు. అనంతపురంలోని రుద్రంపేట ప్రాంతానికి చెందిన ముచ్చుకోట సుష్మా బెంగళూరులోని ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫార్మసీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.


రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

రాయదుర్గం రూరల్ : అటవీ భూముల్లో మట్టి తవ్విన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని డిఎఫ్ఒ చక్రపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అటవీ భూముల మట్టితో రైల్వే పనులు' అని ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి డిఎఫ్ఒ స్పందించారు. ఈ విషయంపై ఇదివరకే పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని రేంజ్ ఆఫీసర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

మట్కా బీటర్ల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సిఐ

గుత్తి : మట్కా రాస్తున్న ఇద్దరు బీటర్లను గుత్తి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సిఐ రామారావు, ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన కంబగిరి, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఆంజనేయులు పట్టణంలోని స్పందన ఫంక్షన్ హాల్ వెనక వైపున మట్కా రాస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. మట్కా బీటర్లను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.52,060 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశామని సిఐ,ఎస్ఐ వెల్లడించారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ

అనంతపురం : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని నగరంలోని శ్రీనివాస్‌నగర్ సీతారామాంజనేయ దేవస్థానంలో దాత సహాయ సహకారాలతో 600 ఉసిరి మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము, శ్రీవారి సేవకులు ప్రసాద్, అనిల్, ముఖేష్, శివ, సురేష్, ప్రకాష్, శ్రీనివాస్‌రావు, సుంకిరెడ్డి, నాగరాజు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు

కుందుర్పి : మండల పరిధిలోని మాయదార్లపల్లి గ్రామంలో సోమవారం వాల్మీకి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాల్మీకి మహిళలు పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచు లలితమ్మ బొమ్మయ్య, వాల్మీకి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సేవా శిబిరం

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామంలో కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన జాతీయ సేవా శిబిరం సోమవారం ముగిసింది. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వీరాపురం తండాలో ఉన్న ఆలయాల వద్ద చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యాంసన్, ఎన్ఎస్ఎస్ పిఒ డి.నారాయణ, అధ్యాపకులు గోవర్ధన్, పాలరాజ్, నాగరాజారెడ్డి, సర్పంచు నాగరాజు, గ్రామపెద్దలు తిప్పేరుద్ర, సత్యనారాయణ, ఉపాధ్యాయులు విశ్వనాథ్, మోహన్‌బాబు, చిత్రయ్య, ప్రశాంత్, శ్రీదేవి, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ఆవులు మేత మేస్తుండగా చిన్న ఘర్షణతో మొదలై రక్తగాయాల వరకూ దారితీసిందన్నారు. ఆయా బాధితు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు

సామాజిక బాధ్యతలపై అవగాహన

ప్రజాశక్తి-శింగనమల

పోలీసు వారోత్సవాల్లో భాగంగా బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి)లో సామాజిక బాధ్యతలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా 'లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 14వ బెటాలియన్ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, 14వ బెటాలియన్ సిఐ టి.రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపికి సన్మానం

బుక్కరాయసముద్రం : ఇటీవల అవిశ్వాస తీర్మానంలో నెగ్గిన ఎంపిపి దాసరి సునీతను మండల టిడిపి నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిపి కార్యాలయంలో మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, పండు, నాన్న, రవీంద్ర, ఆదినారాయణ, జొన్నా రామయ్య, ఓబుళపతి, వడియంపేట సర్పంచు నాగార్జున, వసంత్‌కుమార్, గంగాధర్, వాసుదేవరెడ్డి, బుల్లే ఉజ్జినప్ప, పోలప్ప, నాయకులు పాల్గొన్నారు.



ఎంపిపిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత

స్వచ్ఛాంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సామాజిక సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మెలగాలని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కురుగుంట గ్రామ పరిధిలో నిర్వహించిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భవానీ రవికుమార్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణు ప్రియ నేతృత్వంలో వారం రోజుల పాటు విద్యార్థులతో సామాజిక సేవలో భాగంగా ఎన్ఎస్ఎస్ ద్వారా ప్రజలకు సామాజిక సేవలు అందించడాన్ని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతి మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రాని అమలు చేశారన్నారు. ఆదర్శంగా తీసుకొని కురుగుంట గ్రామం పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండడం వల్ల స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రా సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌ఛైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్, కార్యదర్శి మోహన్‌కృష్ణ, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బి.జీవన్ కుమార్, మై భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.శ్రీనివాసులు, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మణిదీపిక, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, సభ్యులు కే.మహేంద్ర, శిరీష, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.సహదేవుడు, మై భారత్ నోడల్ ఆఫీసర్ యం.అక్షితానంద, ప్లాస్మా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యం.నాగేంద్ర, కురుగుంట గ్రామ పంచాయతీ సెక్రటరీ సర్దార్ వలి, జాతీయ సేవా పథకం వాలంటీర్లు తేజస్విని, వెంకట సాయి, చంద్రశేఖర్, ఫణిరాజ్, మైత్రి, హరిత, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న భవానీ రవిశంకర్

జాబ్‌మేళా బ్రోచర్ విడుదల

కళ్యాణదుర్గం టౌన్ : ఏపి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో చేపట్టే జాబ్‌మేళా బ్రోచర్లను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విడుదల చేశారు. డిసెంబర్ 13న అమరావతిలో హిందూకాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్రాహ్మణసంఘం సభ్యులు ఏఎల్ఎన్ శాస్త్రీ, తాలుక అధ్యక్షులు నాగభూషణం, ఉపాధ్యక్షులు సతీష్‌చంద్ర తదితరులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి తెలిపారు. ఈ కార్యక్రమంలో యార్డు చైర్మన్ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు

ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

అనంతపురం సిటీ : రాష్ట్రంలో 2009 తర్వాత నియమించిన ఉపాధ్యాయులకు టీచర్ ఎబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయులందరూ టెట్ అర్హత సాధించాలని, టెట్ మినహాయింపు విషయం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేదని విద్యాశాఖ అధికారులు చెప్పడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈమేరకు ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్‌లో సవరణలు చేయాలని భారత రాష్ట్రపతి, దేశ ప్రధాన మంత్రి, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రులకు లేఖ రాసినట్లు తెలిపారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో నెలకొన్న దళితుల సమస్యలను పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గోవిందప్ప, వెంకటేష్, రాయుడు, రామన్న, శ్రీకాంత్, జనార్దన్, సవారప్ప తదితరులున్నారు.

పొగాకు వినియోగం హానికరం

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని ఆర్‌డిఒ వసంతబాబుతోపాటు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఎంపిడిఒ ధనుంజయ, సిడిపిఒలు ప్రసన్నలక్ష్మి, పద్మావతి అన్నారు. ఈమేరకు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ప్రోగ్రామ్ అధికారి రాజేష్, ఆరోగ్య కార్యకర్తలు జాన్సన్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థి దశ నుండి సేవాభావాలను అలవర్చుకుని సామాజిక అభివృద్ధికి విద్యార్థులు సహకరించాలని సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, పరిపాలనా అధికారి గంగిరెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని కొల్లకుంటలో సప్తగిరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లకుంట గ్రామంలో ఈ నెల 9వ తేదీ వరకు ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు. ప్రతిరోజు వివిధ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, పారిశుధ్యం, శ్రమదానం వంటి వాటిలో వాలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పార్థసారథి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



శిబిరం ప్రారంభంలో విద్యార్థులు, అధ్యాపకులు

బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలి

సంరక్షణ కేంద్రాలన్నీ లైసెన్స్ పొందాల్సిందే..

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలను సంబంధిత శాఖ అధికారులు తరచూ తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఛాంబర్‌లో బాలల సంరక్షణ కేంద్రాల జిల్లాస్థాయి సిఫారసు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలలో బాలలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఆరోగ్య రక్షణ మంచి వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 అర్హత కలిగిన చైల్డ్ కేర్ సంస్థలకు సంబంధించి జిల్లా స్థాయి సిఫారసు కమిటీ ఆమోద చర్యలను తీర్మానించారు. గుంతకల్లు కేంద్రానికి సంబంధించి పూర్తిస్థాయిలో కేంద్రాన్ని తనిఖీ చేసి తగిన వివరాలతో తదుపరి కార్యాచరణ సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. పిల్లల సంరక్షణ బాధ్యతల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి సమస్యలు లేకుండా బాలల సంరక్షణ కోసం అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా కేంద్రాల నమోదు కానీ పిల్లల సంరక్షణ కేంద్రాలు ఉండకూడదన్నారు. పిల్లల సంరక్షణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని పిల్లల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రాల పని తీరు మంచి వాతావరణంలో కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ అరుణ, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, డిపిఒ ఖలీల్, డిసిపిఒ మంజునాథ్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టడంలో 'కూటమి' విఫలం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి విమర్శించారు. బెల్ట్ షాపులతోపాటు కల్తీ కల్లు విక్రయాలు పెరిగిపోయాయని అన్నారు. ఇటీవల కల్తీ కల్లు సేవించి హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామానికి చెందిన 10 మంది తీవ్ర అస్వస్థతకు గురై గౌరీబిదనూరు మానస ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో వారిని సోమవారం గుడ్డంపల్లి వేణురెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్తీ కల్లు సేవించి ఆసుపత్రి పాలైన బాధితులను ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. కనీసం ఆయా బాధితులను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. అనారోగ్యం పాలైన బాధితులు సొంత డబ్బులతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు హిందూపురాన్ని కల్తీపురంగా మార్చేశారని ఎద్దేవా చేశారు. కనీసం ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి కల్తీ కల్లు బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కల్తీకల్లు విక్రయాలపై చర్యలు తీసుకోకపోతే వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న వేణురెడ్డి